విశాలాంధ్ర అనంతపురం
www.visalaandhra.com
కర్నూలు, గురువారం 1, ఆగస్టు 2024

సమరశీల పోరాటాలే ఊపిరిగా
ఏఐఎస్ఎఫ్ అడుగులు

విద్యారంగ సమస్యలపై ఈ నెల 1వ తేదీ నుంచి ఏఐఎస్ఎఫ్ సమరశీల పోరాటాలకు శ్రీకారం చుట్టనుంది. ఇందులో భాగంగా జీపుజాత నిర్వహించి బహిరంగ సభల ద్వారా సమస్యల పరిష్కారానికై విద్యార్థులకు చైతన్యవంతం చేయనున్నారు. చనున్నారు. ఈ నేపథ్యంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈ.కుల్లాయి స్వామితో విశాలాంధ్ర ప్రత్యేక ఇంటర్వ్యూ.

విశాలాంధ్ర, అనంతపురం అర్బన్ :

1)విద్యా రంగ సమస్యలపై అనంతపురం జిల్లా వ్యాప్తంగా బి.సి,ఎస్సీ,ఎస్టీ సంక్షేమ వసతి గృహాలను సందర్శించారు వాటిలో ఎన్ని భవనాలు అద్దె భవనాలు నిర్వహిస్తున్నారు... ఎన్ని ప్రభుత్వ భవనాలు నిర్వహిస్తున్నారు.. వాటిలో శిథిలావస్థకు చేరినవి ఎన్ని గుర్తించారు?

జ) బి.సి హాస్టల్స్ 53, ఎస్సీ హాస్టల్స్ 55 ... బీసీ హాస్టల్స్‌లో అద్దె భవనాలు 28, సొంత భవనాలు 25, ఎస్సీహాస్టల్స్ అద్దె 34 భవనాలు స్వంత భవనాలు 21 ఉన్నాయి. వీటిలో సుమారు 50పైగా భవనాలల పై కప్పుల పెచ్చులు ఊడిపోవడం,పైకప్పు నుంచి నీరు కారడం, ప్రహరీగోడ లేకపోవడం విషపురుగులు లోపలికి వచ్చే పరిస్థితి నెలకొంది. అదే విధంగా విద్యార్థుల సంఖ్యకు తగట్టు స్నానపు గదులు మరుగుదొడ్లు లేకపోవడం విద్యార్థుల కష్టాలు వర్ణతీతంగా ఉంది.

2) పెండింగ్‌లో ఉన్న మెస్ ఛార్జిలు, కాస్మోటిక్ చార్జీలపై ఏఐఎస్ఎఫ్ ఎలాంటి కార్యక్రమాలు చేపడుతున్నది.?

జ) 7 నెలలు నుంచి మెస్ చార్జిలు మంజూరు కాలేదు .. ఇంటర్ విద్యార్థులకు రూ.1600 పాఠశాల విద్యార్థులకు రూ.1400లు మెను మాత్రం ఖచ్చితంగా అమలు చేయాలని అంటున్నారు తప్ప మెస్ పెరిగిన నిత్యావసర సరుకుల ధరలకు అనుగుణంగా పెంచడం లేదు దీంతో చాలా చోట్ల రోజువారి మెనూ అమలు చేయలేకపోతున్నారు. ఇందుకు ప్రభుత్వం నుంచి ఇంటర్ విద్యార్థులకు రూ.2000 విద్యార్థులకు 1800 ఇవ్వాలని ఏఐఎస్ఎఫ్ ద్వారా ఉద్యమాలు చేయనున్నాము.

3) వసతి గృహాల్లో చాలా చోట్ల సిబ్బంది కొరత ఉందని అంటున్నారు.మీరు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తారా ?

జ) సంక్షేమ వసతి గృహాల్లో సిబ్బంది కొరత చాలా ఎక్కువ ఉంది. దీంతో వార్డెన్‌లకు ఒకటికి రెండు వసతి గృహాలు బాధ్యతలు అప్పజెప్పడంతో నిర్వహర వారి తలకు మించిన భారం అయింది. జిల్లా వ్యాప్తంగా బి.సి వసతి గృహాల్లో 18 వార్డెన్ పోస్టులు, ఎస్సీ వసతి గృహాల్లో వార్డెన్ పోస్టులు 21 ఖాళీగా ఉన్నాయి. చాలా చోట్ల ట్యూటర్ పోస్టులు లేవు. కొన్ని చోట్ల ఉన్న వారికి జీతాలు రాక వదలి వెళ్లిపోయి పరిస్థితి నెలకొంది.

4) మీ ఏఐఎస్ఎఫ్ పర్యటనలో సంక్షేమ వసతి గృహాలలో ఉండే విద్యార్థుల ప్రధాన సమస్యలు గుర్తించారా..?

జ) అనంతపురం నగరంలో ఉన్న హౌసింగ్ బోర్డు శివారులలో ఉన్న ఎస్సీ 2 కాలేజి హాస్టల్ నుంచి సుమారు 5 కిలోమీటర్‌ల కంటే దూరం జూనియర్ కాలేజి ఆర్ట్స్ కాలేజి ఉంది. అక్కడికి నడిచివెళ్లాలంటే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. వసతి గృహం అద్దె భవనం కాబట్టి కాలేజి దగ్గర ఎక్కడైనా మార్చే విధంగా అధికా రులు చర్యలు చేపట్టాలి. గుత్తి బాలికల బి.సి కాలేజి వసతి గృహంలో మొత్తం 273 మందికి గాను 6 గదులు ఉండడంతో ఒక రూములో 40 మంది పడుకోవాల్సి వస్తోంది. దీంతో పాటు విదార్థులకు సంఖ్య తగ్గట్టు భవనాలు పక్కా భవనాలు నిర్మించి విద్యా హక్కు చట్టం ప్రకారం మౌలిక వసతులు కల్పించాలి. అదే విధంగా అనంతపురం లో ఉన్న గిల్డ్ ఆఫ్ సర్వీస్ స్కూల్ హాస్టల్ లో కూడా అదే పరిస్థితి నెలకొంది. జిల్లాలో చాల చోట్ల ఇటువంటి పరిస్థితి నెలకొంది ఈవిషయం అధికారుల దృష్టికి ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తాము.

5) బి.సి ఎస్సీ వసతి సంక్షేమ గృహాల అధికారుల పని తీరుపై అక్రమాలు మీ పర్యటనలో ఏమైనా గుర్తించారా..?

జ) జిల్లాలో బి.సి ఎస్సీ వసతి సంక్షేమ గృహాలు తనిఖీలలో డి.డిలు వైఫల్యం కారణంగా దాన్ని ఆసరగా తీసుకుంటున్న కొన్ని చోట్ల వార్డెన్‌లు అక్రమాలకు పాల్పడకుండా మెస్ చార్జిలకు సంబంధించి విద్యార్థుల హాజరు బయోమెట్రిక్ పరిగణలోకి తీసుకుని, మాన్యువల్ హాజరు రద్దు చేస్తే అక్రమాలు అరికట్టవచ్చు.డి.డిలు వసతి గృహాలు తనిఖీ విధిగా చేయాలని ఉన్నతాధికారుల దృషికి తీసుకెళ్లి సంబంధిత అధికారులపై చర్యలు చేపట్టేవిధంగా చేస్తాము.

6) వసతి గృహాల సమస్యల పరిష్కారం కోసం ఏఐఎస్ఎఫ్ ద్వారా ఎటువంటి కార్యక్రమాలు చేపడుతున్నారు..?

జ) ఆగష్టు 1 నుంచి 3 వరకు జీపు జాతా నిర్వహించి 6 వతేది వేలాది మంది విద్యార్థులతో కలెక్టర్ కార్యాలయం వద్ద మహా ధర్నా చేపడుతాము. ప్రభుత్వ వసతి గృహాల విద్యార్థులకు మెస్‌చార్జిలు ప్రభుత్వం పెంచే వరకు జిల్లా ఏఐఎస్ఎఫ్ సమితి ఆధ్వర్యంలో ఉద్యమాలు చేస్తాము.. ప్రభుత్వంలో కదలిక రాకపోతే ప్రజాప్రతినిధుల ఇళ్ల ముట్టడి కార్యక్రమం చేస్తామన్నారు.

పారదర్శకంగా రేషన్ పంపిణీకి చర్యలు..

విశాలాంధ్ర–ఉరవకొండ: పారదర్శకంగా రేషన్ పంపిణీకి చర్యలు తీసుకుంటామని రేషన్ పంపిణీలో ఎవరైనా అక్రమాలకు పాల్పడితే అలాంటి వారిపై 6ఏ కేసులు నమోదు చేస్తామని జిల్లా సివిల్ సప్లై అధికారి శోభారాణి తెలిపారు. బుధవారం ఉరవకొండ పట్టణంలో ఉన్న సివిల్ సప్లై స్టాక్ పాయింట్‌ను గుంతకల్ ఆర్డీవో శ్రీనివాస్ రెడ్డితో కలిసి ఆమె తనిఖీ చేశారు. జిల్లా వ్యాప్తంగా 1645 రేషన్ దుకాణాలు ఉన్నాయని వీటి ద్వారా ప్రజలకు బియ్యం తదితర సరుకులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. రాగులు, జొన్నలు కూడా సరఫరా చేసేందుకు చర్యలు తీసు కుంటున్నట్లు తెలిపారు. ప్రతినెలా సివిల్ సప్లై స్టాక్ పాయింట్ తో పాటు రేషన్ దుకా ణాలను కూడా తనిఖీ చేస్తామని, అక్రమాలు జరిగినట్లు తెలిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. వివాదాస్పదంగా ఉన్న రేషన్ దుకాణాలకు సంబంధించి అలాంటి వాటిపై వీఆర్వోలు బాధ్యత తీసుకొని ప్రతి లబ్ధిదారునికి సరుకులు అందే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ హరిప్రసాద్, వీఆర్వోలు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో ఎగువ కాలువను నిర్వీర్యం చేశారు..

- ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు
- బొమ్మనహాల్ వద్ద తుంగభద్ర జలాలకు పూజలు
- టీడీపీ ప్రభుత్వ చొరవతో 26 టీఎంసీల నీరొస్తోంది..

విశాలాంధ్ర–బొమ్మనహాల్: అనంతపురం జిల్లా తాగు, సాగునీటి తీర్చే వరప్రదాయని తుంగభద్ర ఎగువ కాలువను గత వైసిపి ప్రభుత్వం ఐదేళ్లలో నిర్వీర్యం చేసిందని రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు అన్నారు. బుధవారం బొమ్మనహాళ్ సరిహద్దులోని 105 కిలోమీటర్ వద్ద ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షులు కొండాపురం కేశవరెడ్డి, నియో జకవర్గ అధ్యక్షులు ఎర్రగుంట్ల వెంకటేశులు, కొత్తపల్లి మల్లికార్జున తుంగభద్ర జలాలకు పూజలు నిర్వహించి స్వాగతించారు. అనంతరం విలేకరులతో కాల్వ శ్రీనివాసులు మాట్లాడుతూ కర్ణాటకలో అధునీకీకరణ పనులు పూర్తయి అక్కడ వరకు నీళ్లు బాగా వస్తున్నాయి. 5 సంవత్సరాల జగన్మోహన్‌రెడ్డి పాలనలో తుంగభద్ర ఎగువ కాలువ ఒక అనాధలా మారిందన్నారు. ఒక్క రూపాయి ఖర్చు పెట్టకుండా ఒక గంపెడు మట్టిని తీయకుండా నిర్వహణకు ఒక పైస విదుల్చకుండా హెచ్ ఎల్ సి నీటి నిర్వహణపై తీవ్రమైన నిర్లక్ష్యం చేయడం వల్ల ఈరోజు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. హెచ్ఎల్సిపై అసెంబ్లీలో కూడా నేను ప్రశ్న వేసి జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు హామీ ఇచ్చే విధంగా చూశామని తెలిపారు ఈ ఏడాది తుంగభద్ర రిజర్వాయర్ పొంగిపొర్లి ప్రవహిస్తున్నదని, 26 టీఎంసీల పైగా మన వాటా మనకు అందుతుందన్నారు. ఇంకా ఎక్కువ నీళ్ల తెచ్చుకునే విధంగా మేము తగిన శ్రద్ధ చూపుతామన్నారు. ఖరీఫ్ పంటలు ఇప్పటికే దెబ్బతిన్నాయి ఇంకా విత్తనమే పడలేదు వాన జాడ లేదు కాబట్టి ఆయకట్టు భూములోనైనా మంచి పంటలు సాగు చేసి మంచి దిగుబడి సాధించాలని సూచించారు. నీటిని వృధా చేయకుండా పొదుపుగా వాడుకొని రైతులందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ బలరామిరెడ్డి, సింగల్ విండో మాజీ అధ్యక్షులు కొత్తపల్లి మల్లికార్జున, మాజీ జెడ్పిటిసి వాణి జగన్నాథ్‌రెడ్డి, టిడిపి నాయకులు అప్పారావు, ముల్లంగి నారాయణస్వామి, పయ్యావుల నాగరాజు, పయ్యావుల మోహన్, షణ్ముఖయ్య, ధనంజయ, తిమ్మరాజు, పయ్యావుల అనిల్, మహేంద్ర, మాజీ సర్పంచులు ఆర్ గోవిందరెడ్డి, ఉప్పరహాల్ స్వామి, పల్లి తిప్పేస్వామి తదితరులు పాల్గొన్నారు.

హంద్రీనీవా కింద టెయిలెండ్ వరకు నీరందించాలి

- ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్
- హంద్రీనీవా అధికారులతో సమీక్ష

అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి కేశవ్

విశాలాంధ్ర–ఉరవకొండ : హంద్రీనీవా కెనాల్ కింద జిల్లాలో ఎక్కడా ఇబ్బంది లేకుండా టెయిలెండ్ వరకు నీటిని అందించేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అధికారులను ఆదేశించారు. బుధవారం అనంతపురం ఆర్.అండ్.బి అతిథి గృహంలో హెచ్ఎన్ఎస్ఎస్ ప్రాజెక్టు, నీటి కేటాయింపులు, పెండింగ్ పనులు, సమస్యలపై హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులతో మంత్రి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ హెచ్ఎన్ఎస్ఎస్ కాల్వకు ఈ ఏడాది శ్రీశైలం జలాశయం నుంచి జిల్లాకు 40 టిఎంసిల నీటిని కేటాయించడం జరిగిందని, నీటిని తీసుకురావడం ఇప్పటికే ఆలస్యం కాగా, త్వరగా జిల్లాకు నీటిని తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రాజెక్టు పరిధిలో పెండింగ్ పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఏవైనా సమస్యలు ఉన్నా వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా హెచ్ఎన్ఎస్ఎస్ ప్రాజెక్టు ప్రిలిమినరి స్టేటస్, పెండింగ్ పనుల స్టేటస్, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో హంద్రీ-నీవా సిఈ నాగరాజ, ఎస్ఈ దేశే నాయక్, ఈఈ లు ,డిఈ లు,ఏ ఈ లు పాల్గొన్నారు.

విద్యార్థులకు అందించే భోజనం నాణ్యతగా ఉండాలి

-త్వరలోనే ఇంటర్మీడియట్‌కు అనుమతి తీసుకొస్తాం
- రాప్తాడు ఎమ్మెల్యే సునీత
- నసనకోట జ్యోతిబాపూలే పాఠశాల ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర-రాప్తాడు: విద్యార్థులకు అందించే భోజనం నాణ్యతగా ఉండాలని ఎమ్మెల్యే పరిటాల సునీత సూచించారు. రామగిరి మండలం నసనకోటలో ఉన్న జ్యోతిబాపూలే పాఠశాలను ఎమ్మెల్యే సునీత ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరిటాల సునీత పాఠశాలలోకి రాగానే అక్కడున్న ఉపాధ్యాయులు, సిబ్బంది అప్రమత్తమయ్యారు.నేరుగా పాఠశాలలోని ప్రతి గదికి వెళ్లి పరిశీలించారు. పాఠశాలకు పంపిణీ చేసే సరుకులు, పండ్లు, కూరగాయలు, ఆకుకూరల నాణ్యతను పరిశీలించారు. భోజనశాల, తరగతి గదులలో పారిశుద్ధ్య పరిస్థితులను చూసి అక్కడ సిబ్బందికి కొన్ని సూచనలు చేశారు. అనంతరం విద్యార్థినులతో కలసి సహపంక్తి భోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. అయితే ఇంకా కొంత పరిస్థితి మెరుగుపడాలని సూచనలు చేశారు. అలాగే ప్రస్తుతం ఉన్న పరిస్థితుల గురించి ఆరా తీశారు. పాఠశాల అభివృద్ధికి కావాల్సిన అవసరాలను తెలియజేయాలని ప్రిన్సిపాల్ అమీనాను ఆదేశించారు. ఎంతోమందికి ఉపయోగపడేలా ఇక్కడ గురుకుల పాఠశాల తీసుకొచ్చామన్నారు. ఇప్పుడు విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా జూనియర్ ఇంటర్ కళాశాలకు అనుమతి కోరామని.. త్వరలోనే అది సాధిస్తామని పరిటాల సునీత అన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం ఇతర సౌకర్యాల విషయంలో ఎలాంటి రాజీలేదని స్పష్టం చేశారు.

రైతులను కించపరిచేలా మాట్లాడితే సహించం

విశాలాంధ్ర-రాప్తాడు: తమ అవసరాల కోసం కార్యాలయాలకు వస్తున్న రైతుల పట్ల కించపరిచేలా మాట్లాడితే సహించేదిలేదని ఎమ్మెల్యే పరిటాల సునీత తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. చెన్నేకొత్తపల్లి, రామగిరి, కనగానపల్లి మండల విద్యుత్ శాఖ అధికారులతో బుధవారం వెంకటాపురంలోని క్యాంపు కార్యాలయంలో ఆమె సమావేశం నిర్వహించారు. విద్యుత్ శాఖ ఏడిఏ తో పాటు ఏఈలు ఈ కార్యక్రమంలో హాజరయ్యారు. గత కొన్ని నెలలుగా విద్యుత్ పరంగా ఎదురవుతున్న సమస్యల గురించి రైతులు పెద్ద ఎత్తున ఫిర్యాదులు చేస్తున్నారని.. అయినప్పటికీ దీనిపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. చాలామంది రైతులు కరెంటు ప్రమాదాలు వలన మృత్యువాత పడుతున్నారని అన్నారు. ట్రాన్స్‌ఫార్మార్ల కోసం డబ్బులు చెల్లించి ఏళ్లు అవుతున్నా... ఇంత వరకు ఎందుకు మంజూరు చేయలేదనిఆరా తీశారు. అయితే వైసీపీ నాయకులకు అడిగిన వెంటనే ట్రాన్స్ ఫార్మార్లు ఎలా వస్తున్నాయని ప్రశ్నించారు. రైతుల విషయంలో రాజకీయాలు ఎందుకని ఆగ్రహం వ్యక్తం చేశారు. ట్రాన్స్ ఫార్మార్ల విషయంలో సీనియారిటీ ప్రాతిపదికన వెంటనే మంజూరు చేయాలన్నారు. ట్రాన్స్ ఫార్మార్ల కొరత ఉంటే కచ్చితంగా ఉన్నతాధికారులకు తెలియజేసి వెంటనే తీసుకొస్తామన్నారు. ఇకనుంచి రైతుల వైపు నుంచి ఎలాంటి ఫిర్యాదులు ఉండకూడదని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు.

పెండింగ్ జీతాలు మంజూరు చేయండి సారూ..

- కలెక్టర్‌కు తాగునీటి సరఫరా కార్మికుల విజ్ఞప్తి

విశాలాంధ్ర–ఉరవకొండ: తమకు ఏడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతాలను తక్షణమే మంజూరు చేయాలని ఉరవకొండ ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం పరిధిలో తాగు నీటిని సరఫరా చేస్తున్న కార్మికులు కలెక్టర్ వినోద్ కుమార్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. ఉరవకొండ మండలం నింబగల్లు వద్ద ఉన్న సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుల పరిశీలనకు మంగళవారం సాయంత్రం కలెక్టర్ రావడంతో కార్మికులు ఆయన్ను కలిసి సమస్యలను విన్నవించుకున్నారు. ఏడు నెలలుగా జీతాలు రాకపోవడంతో పాటు రెండు సంవత్సరాల నుండి తమ జీతం నుండి ఈపీఎస్ రికవరీ చేసినప్పటికీ మా ఖాతాలోకి జమ కాలేదని తెలిపారు. ఈఎస్ఐ(ప్రమాద బీమా) కూడా కట్టలేదని తెలిపారు. స్కీం కాంట్రాక్టర్లు, సబ్ కాంట్రాక్టర్లు బిల్లులు చెల్లించినప్పటికీ కార్మికులకు జమ కాలేదన్నారు. పెరిగిన నిత్యావసర ధరలను దృష్టిలో ఉంచుకొని కార్మికులకు న్యాయం చేయాలన్నారు. ప్రతినెల 1వ తేదీని జీతాలు మంజూరు చేయాలని, ఈపీఎస్ కూడా కట్టాలని కోరారు. కార్యక్రమంలో కార్మిక యూనియన్ నాయకులు మల్లికార్జున, రామాంజనేయులు, రాజశేఖర్, సాదిక్, శ్రీనివాసులు, ఉమాపతి పాల్గొన్నారు.

ఆరోగ్యం పట్ల అశ్రద్ధ వహించొద్దు

- ఎస్పీ కె.వి మురళీకృష్ణ - పదవీ విరమణ ఎస్సైకు సన్మానం

విశాలాంధ్ర–అనంతపురం : పదవీ విరమణ పొందాక శేష జీవితాన్ని మంచి ఆరోగ్యంతో సుఖంగా గడపాలని ఎస్పీ కె.వి. మురళీకృష్ణ ఆకాంక్షించారు. ఎస్సై నాగరాజు పదవీ విరమణ పొందడంతో స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాలులో ఎస్సై దంపతులకు ఎస్పీ సన్మానించారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సమాజం కోసం సుమారు మూడు నుంచీ నాలుగు దశాబ్దాలు పాటు సేవలందించి జీవితాలను పునీతం చేసుకున్నారన్నారు. విధి నిర్వహణలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని ఉద్యోగ బాధ్యతలను విజయవంతంగా ముగించడం ముదావహమన్నారు. పదవీ విరమణ పొందినప్పటికీ ఏవైనా సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలని... జాప్యం లేకుండా పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. శేష జీవితంలో కూడా ఉల్లాసంగా జీవించేలా వాకింగ్ , తదితర అలవాట్లను పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎస్బీ సి.ఐ ఇందిర, ఆర్ ఐ మధు, జిల్లా పోలీసు కార్యాలయం పరిపాలన అధికారి శంకర్, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్ నాథ్ , సుధాకర్ రెడ్డి, తేజ్ పాల్, లక్ష్మినారాయణ, బి సూపరింటెండెంట్లు ప్రసాద్, సావిత్రి, ఎస్బీ సి.సి ఆంజనేయ ప్రసాద్ పాల్గొన్నారు.

లక్ష మొక్కలు నాటడమే లక్ష్యంగా ముందుకెళ్తాం...

... ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

విశాలాంధ్ర–అనంతపురం అర్బన్ : అనంతపురం నగరంలో లక్ష మొక్కలు నాటడమే లక్ష్యంగా ముందుకెళ్తామని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం గ్రీన్ ఆర్మీ ఆధ్వర్యంలో మొక్కలు పంపిణీ కార్యక్రమమంలో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నీరు ప్రగతి పార్కులో మొక్కలు నాటి, ప్రజలకు మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దగ్గుపాటి మాట్లాడుతూ తల్లి పేరు మీద ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఆయన సూచించారు. మొక్కలు నాటి సంరక్షించిన వారికి కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంస పత్రాలు అందిస్తామని ఎమ్మెల్యే దగ్గుపాటి తెలిపారు. బాధ్యతగా ప్రజలు స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో తరలి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి కార్పొరేషన్ కమిషనర్ పి. వి. వి. ఎస్ మూర్తి , డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి , గ్రీన్ ఆర్మీ అనిల్ కుమార్ ప్రమీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

భూమిలేని రైతులకు కౌలు ధృవీకరణ పత్రాలు..

విశాలాంధ్ర-రాప్తాడు: గ్రామాల్లో భూమిలేని ఆసక్తి ఉన్న వ్యవసాయ రైతులకు కౌలు దృవీకరణ పత్రాలను వ్యవసాయ శాఖ తరపున మంజూరు చేస్తామని ఏడీఏ రవికుమార్ తెలిపారు. మరూరు రైతు సేవా కేంద్రంలో బుధవారం కౌలు రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన రైతులతో మాట్లాడుతూ ఇతర రైతుల భూములను కౌలుకు తీసుకుని సాగుచేయడం ద్వారా రైతులకు పంటల పైన రుణాలు, ప్రభుత్వం అందించే ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్ పథకాలకు అర్హులు అవుతారన్నారు. ఈ కార్యక్రమంలోలో ఏఓ శేఖర్ రెడ్డి, వీఏఏ గౌస్ బాషా, వీహెచ్ఏ హర్ష, ఎంపీఈఓ రాజు పాల్గొన్నారు.

రాయదుర్గంలో పారిశుధ్య పనులు వేగవంతం

విశాలాంధ్ర-రాయదుర్గం : రాయదుర్గం ఎమ్మెల్యే కాలువ శ్రీనివాసులు ఆదేశాలతో 12 సంవత్సరాల సమస్యను ఎన్డీఏ ప్రభుత్వం తీర్చింది. రాయదుర్గం పట్టణంలోని వివిధ వార్డుల్లో భారీ మెగా పారుశుద్ధ పనులను వేగవంతంగా మున్సిపల్ అధికారుల సహకారంతో జరుగుతున్నాయి, 18వ వార్డు ప్రాంతంలో ఉన్న అన్న క్యాంటీన్ వెనకాల గత 12 ఏళ్ళ నుంచి అభివృద్ధి లేక పారిశుధ్య పనులు చెయ్ లేక ఆ ప్రాంతమంతా అభివృద్ధి ఏమాత్రం చేయలేక నిర్లక్ష్యం వహించారు. గత పాలకులు,నేడు ఎమ్మెల్యే కాలువ శ్రీనివాసులు సహకారంతో తాత్కాలిక మట్టి రోడ్డు ఏర్పాటు చేశారు. కాలువలో పూడిక తీయటం పారిశుద్ధ పనులు చేయటం జరిగిందని సామాజిక కార్యకర్త బిఏం,నాదల్ తెలిపారు. మా సమస్యలు పరిష్కారం చేసినందుకు అ వార్డు ప్రజలు ప్రభుత్వానికి మునిసిపల్ అధికారులకు కృతజ్ఞత తెలియజేశారు. ఈ కార్యక్రమం నందు 18వ వార్డు ఇంచార్జి వేణు,17వ వార్డు కొలిమి కర్రన్న మునిసిపల్ అధికారులు, పాల్గొన్నారు.

ముగిసిన చిన్న పీర్లపండుగ

విశాలాంధ్ర–కూడేరు : మండలంలోని కూడేరు, కడదరకుంట, అరవకూరు గ్రామాల్లో బుధవారం చిన్న పీర్లపండుగ ముగిసింది. ఇందులో భాగంగా నిన్న మంగళవారం పెద్ద సరిగేత్తు, పానకాలు, అగ్నిగుండం కాల్చుట తదితర కార్యక్రమాలు నిర్వహించారు. బుధవారం ఉదయం పీర్లదేవుళ్ళు గ్రామ పురవీధుల్లో ఊరేగింపు జరిగింది. అనంతరం స్వాములు అగ్ని గుండంలో దిగారు. సాయంత్రం జలాధికి పోయాయి. చిన్న పీర్ల పండుగలు ఘనంగా ముగిసాయి. కార్యక్రమం గ్రామ పెద్దలు ఆధ్వర్యంలో జరిగింది. పోలీసులు అవాంఛనీయ సంఘటన జరగకుండా గట్టి బంధోబస్తు ఏర్పాటు చేశారు.

మీటర్ రీడర్స్ వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

ఆర్థికశాఖ మంత్రి కేశవ్,
ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌కు వినతి

విశాలాంధ్ర బ్యూరో–అనంతపురం: మీటర్ రీడర్స్ కి ఉద్యగ భద్రత కల్పించాలని బుధవారం యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంటాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, అనంతపురం జిల్లా ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్‌ను కలిసి మీటర్ రీడర్ రీఛార్జ్ మీటర్లు వస్తున్న నేపథ్యంలో మీటర్ రీడర్స్ కి ఉద్యోగ భద్రత కల్పించి నెలవారి వేతనాలు కల్పించాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంటాక్ట్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి రమాదేవి కోరారు. అలాగే మీటర్ రీడర్స్ కి ఎస్ క్రో అకౌంట్ ద్వారా జీతాలు చెల్లించాలని జేఎండి మల్లారెడ్డి , సీఎండి సంతోష్‌రావు తెలిపారు. మీటర్ రీడర్స్‌కి ఎస్కో అకౌంట్ ద్వారా జీతాలు చెల్లించే ఏర్పాటు చేయడంతో పాటు మీటర్ రీడర్స్‌కి ఉద్యోగ భద్రత కల్పించేందుకు ప్రభుత్వం తక్షణమే ఆదేశాలు అమలు చేయాలని మీటర్ రీడర్స్ రాష్ట్ర కోశాధికారి రమేష్‌బాబు డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్పీడీసీఎల్ వర్కింగ్ ప్రెసిడెంట్ కిరణ్ కుమార్ సత్యసాయి జిల్లా కోశాధికారి దస్తగిరి, అనంతపురం జిల్లా అధ్యక్షులు రాము ఉపాధ్యక్షులు సలీం. భాస్కర తదితర మీటర్ రీడర్స్ పాల్గొన్నారు.

ఉపసర్పంచ్‌ను సన్మానించిన ఎమ్మెల్యే కాలవ

విశాలాంధ్ర–బొమ్మనహాల్: బొమ్మనహాల్ గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ పయ్యావుల హనుమంతప్పను రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు బుధవారం పరామర్శించారు. పయ్యావుల హనుమంతప్ప పక్షవాతంతో బాధపడుతూ ఉండడంతో ఆయన స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులను ఎప్పటికప్పుడు సంప్రదించాలని ఆయనకు సూచించారు. బాగా విశ్రాంతి తీసుకుని ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు మోహన్‌బాబు, టిడిపి నాయకులు పయవుల అనిల్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య ఉండరాదు..

- జిల్లా ఆర్డబ్ల్యూఎస్ అధికారులకు మంత్రి సవితమ్మ ఆదేశం
- ఉపాధి హామీ కూలీల సంఖ్య పనిదినాలు పెంచండి

విశాలాంధ్ర. పెనుకొండ .. నియోజకవర్గంలో ఎక్కడా కూడా తాగునీటి సమస్య తలెత్తరాదని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ మంత్రి ఆర్డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. బుధవారం మంత్రి క్యాంపు కార్యాలయంలో జిల్లా ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ మల్లికార్జున, ఆ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నియోజకవర్గంలో తాగునీటి సమస్య ఏ గ్రామంలో కూడా ఉండకూడదని ప్రతి గ్రామానికి మంచినీరు ఇచ్చేలా ప్రత్యేక స్కీం తయారు చేయాలని ఆదేశించారు. గ్రామాలలో జరుగుతున్న జై జైఎం ప్రాజెక్టు తొందరగా పూర్తి చేయాలని అనంతరం డ్వామ ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయేంద్ర ప్రసాద్‌తో సమావేశం నిర్వహించారు. ఉపాధి హామీ కూలీల సంఖ్యతో పాటు పనిదినాలు పెంచాలని కేంద్ర రాష్ట్ర భాగస్వామ్యంతో మల్బరీ షెడ్లు, పశువుల షెడ్లు గొర్రెల షెడ్లు, కోళ్ల ఫారం లు, వాటి యొక్క అంచనాలు తయారు చేసి, వీళ్ళని ఎక్కువ యూనిట్ల మంజూరు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్, డ్వామా అధికారులు, తదితరులు పాల్గొన్నారు..

త్వరలో ప్రజాప్రతినిధులకు సన్మానం

విశాలాంధ్ర-పెనుకొండ : తెలుగుదేశం పార్టీలో ప్రజా ప్రతినిధులుగా ఎన్నికైన మంత్రి సవితమ్మకు హిందూపురం ఎమ్ పి బికే పార్థసారథికి, కర్నూలు ఎంపీ పంచలింగాల నాగరాజుకి త్వరలో సన్మానం చేయాలని శ్రీసత్యసాయి జిల్లా కురుబ సంఘం ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం త్వరలో నిర్వహించాలని కురుబ సంఘం నేతలు తీర్మాణించారు. బుదవారం పెనుకొండ పట్టణంలోని అన్నాక్యాంటీన్ కార్యాలయంలో కురుబసంఘం నాయకులు సమావేశం నిర్వహించారు. జిల్లా కురుబసంఘం నాయకులు సామకోటి ఆది నారాయణ మాట్లాడుతు త్వరలో పెనుకొండ పట్టణంలో కురుబ కులబాందవులైన మంత్రి ఎంపీలకు సన్మాన కార్యక్రమంలో కురుబ కులబాంధవులు అందరు పార్టీలకు అతీతంగా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కురుబ సంఘం నాయకులు సర్పంచ్ శ్రీనివాసులు, మాజీ జడ్ పిటీసి రామక్రిష్ణ, సోమందేపల్లి మండల కన్వీనర్ సిద్ద లింగప్ప, చెన్నప్ప, బన్యాలరమేష్, కిష్టప్ప, కమ్మన్న, మల్లికార్జున, తిరుపాలు పాల్గొన్నారు.

కరువు జిల్లాను ఆదుకోండి..

- సీఎం పర్యటనలో జిల్లాకు ప్రత్యేక వరాలు కురిపిస్తారా...?
- చెరువులకు నీటిని నింపేరా ..

విశాలాంధ్ర: బ్యూరో, శ్రీ సత్యసాయి ,. మడకశిర నియోజకవర్గంలోని గుండుమల గ్రామానికి ముఖ్యమంత్రి హెూదాలో తొలిసారిగా వస్తున్న నారా చంద్రబాబు నాయు దు జిల్లాకు ప్రత్యేకమైన అవకాశాలు ఏమైనా కల్పిస్తారా అంటూ ప్రత్యేక చర్చ నడుస్తుంది, సీఎం చంద్రబాబు తొలిసారిగా అత్యంత వెనక పడిన ప్రాంతానికి విచ్చేస్తున్నారు, ఈ నేపథ్యంలో జిల్లా అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు ప్రకటిస్తారని టిడిపి క్యాడర్లో ఆశాభావం వ్యక్తం అవుతున్నది, సత్య సాయి జిల్లాలో వర్షాకాలమైన ఈ సీజన్లో వర్షాలు తగ్గుముఖం పట్టాయి. ఇదివరకు చాలా ప్రాంతాలలో వర్షాలు కురవక పోవడంతో రైతన్నలు ఆకాశం వైపు చూస్తున్నారు. ఈ తరుణంలో జిల్లా రైతాంగాన్ని ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది .దీంతోపాటు వర్షాభావాన్ని అధికమించడంలో భాగంగా హంద్రీనీవా కాలువ పనులు పూర్తి చేయాల్సి ఉంది, అంతేకాక కంప చెట్లతో పేరుకుపోయిన కాలువలను మరమ్మత్తులు చేయాల్సిన అవసరం ఉంది, పెనుగొండ డివిజన్లో 165 చెరువులకు హంద్రీనీవా ద్వారా నీటితో నింపాలని రైతులు కోరుతున్నారు, ఈ విషయంపై ఇటీవల రైతు సంఘం నాయ కులు స్పందించి హంద్రీనీవా కాలువలు రిపేరు చేయిం చాలని చెరువులను నీటితో నింపాలని ప్రభుత్వానికి వినతిపత్రం అందజేశారు. సీఎం చంద్రబాబు పర్యటన లో వెనుకబడిన సత్యసాయి జిల్లాకు ప్రత్యేక నిధులు కేటాయిస్తారో లేదో అన్నది వేచి చూడాల్సిందే.

అంతేకాక ఎన్నికల మేనిఫెస్టో లో అన్న దాత సుఖీభవ, తల్లికి వందనం, ఇంతవరకు అందలేదు దీంతోపాటు ఈ విద్యా సంవత్సరం తల్లికి వందనం లబ్ధిదారులకు అం దలేదు. అత్యంత వెనుకబడిన జిల్లా అయినా సత్య సాయి జిల్లాలో పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ప్రజలు కోరుకుం టున్నారు కావున కరువు జిల్లాను దృష్టిలో పెట్టుకొని ప్రజలకు కావలసిన ప్రధాన సేవా కార్యక్రమాలను పరిష్కరించవలసిన అవసరం ఎంతైనా ఉందంటూ మేధావులు చర్చించుకుంటున్నారు .

మఠం భూములకు పట్టాలు ఇవ్వాలి

- సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా

విశాలాంధ్ర-ధర్మవరం: బత్తలపల్లి నిడిమామిడి మఠం భూమి సర్వే నెంబర్ 401 లో పేదలు వేసుకున్న నిర్వాసితులతో కలిసి గుడిసెలకు పట్టాలు మంజూరు చేయాలంటూ నియోజకవర్గ సిపిఐ కార్యదర్శి ముసుగు మధు, జింక చలపతి ఆధ్వర్యంలో ధర్మవరం ఆర్డిఓ కార్యాలయం ముందు ధర్నా చేస్తూ డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డిఓ వెంకట శివరామిరెడ్డి కి వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం మధు, జింక చలపతి మాట్లాడుతూ నేషనల్ హైవే ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్న గూడూరు మఠానికి చెందిన భూమిని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి అనుచరులు పట్టాలు చేయించుకోవడం దారుణమన్నారు. అంతేకాకుండా ఆ భూమి పిత్రార్జితము అన్నట్లు రికార్డులను సృష్టించడం నియోజకవర్గ ప్రజలను ఆశ్చర్యానికి గురి చేసిందని వారు తెలిపారు. కోటి రూపాయల భూమిని కబ్జా చేయాలని ఉద్దేశంతోనే మాచిరెడ్డి గారి ఈశ్వర్ రెడ్డి వారి కుటుంబ సభ్యులతో పాటు మిగతా వారిని కూడా ఇందులో చేర్చడం చూస్తూ ఉంటే అక్రమ దనార్జన చేయాలన్న ధ్యేయంతోనే భూమిని కబ్జా చేయడం జరిగిందని తెలిపారు. కబ్జాకు పాల్పడిన వారు ఎవరైనా సరే వారిని జైలుకు పంపే వరకు ఎర్రజెండా ప్రజల పక్షాన పోరాటం చేస్తుందని తెలిపారు. ప్రజలకు సిపిఐ ఎండగా ఉంటూ వారికి ఇళ్ల స్థలాలను కచ్చితంగా కేటాయిస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి రవికుమార్, సహాయ కార్యదర్శి ఎర్రం శెట్టి రమణ, జిల్లా చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వెంకటనారాయణ, జిల్లా అధ్యక్షులు వెంకటస్వామి, బత్తలపల్లి సిపిఐ మండల కార్యదర్శి వెంకటేషు, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కుల్లాయప్ప, శ్రీధర్, ఆదినారాయణ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ధర్మవరంలో రెండ్రోజులు నీటి సరఫరా బంద్

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలో నీటి సరఫరాకు సంబంధించి పార్నపల్లి వాటర్ వర్క్స్‌లో మెయిన్‌టనెన్స్ వర్క్స్ ఉన్నందున ఆగస్టు 2వ ,3వ తేదీలలో నీటి సరఫరా ఉండదని మున్సిపల్ కమిషనర్ రామ్కుమార్ తెలిపారు. ప్రజలు నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని కోరారు. రెండు రోజులు నీటి సరఫరా ఉండదు కావున ప్రజలు సహకరించాలని పత్రికా ముఖంగా తెలిపారు.

ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర-ధర్మవరం: ఉపాధి హామీ పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అంబుడ్స్ మెన్ శివారెడ్డి తెలిపారు. బుధవారం నిమ్మలకుంటలో గల చింత తోపులు చింత చెట్ల చుట్టూ చేస్తున్న నీటి నిల్వ కందకాల పనిని పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. కూలీలతో మాట్లాడుతూ అన్ని కుటుంబాల వారు ఖచ్చితంగా నూరు రోజుల ఉపాధి హామీ పనులు పూర్తి చేసుకునేలా కృషి చేయాలని తెలిపారు. దినసరి వేతనం 300 రూపాయలు పడేవిధంగా పనిచేయాలని తెలిపారు. కూలీలలోని కొందరు గతంలో చేసిన పనికి సంబంధించిన రెండు వారాల బిల్లులు ఇంకా రాలేదని, అడుగగా త్వరలోనే జమ అవుతుందని తెలిపారు.పని దినాలు కూడా పెంచే అవకాశం ఉందని ఎవరికైనా కొత్తగా పెళ్లయిన జంటలకు జాబ్ కార్డు లేకుంటే వారి ఆధార్ బ్యాంకు అకౌంట్స్ జిరాక్స్ తీసుకొని అప్లికేషన్ను ఏపీవో లేదా ఎంపీడీవోకు ఇస్తే రెండు రోజుల్లో జాబ్‌కార్డు మంజూరు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ అనిల్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

పశువులకు శర్మ ముద్ద వ్యాధికి వ్యాక్సినేషన్

విశాలాంధ్ర-ధర్మవరం: రాష్ట్రంలోని రైతులకు ఆరోగ్యమైన పశువులతో మెరుగైన లాభాలు పొందడానికి చంద్రబాబు నాయుడు నాయకత్వం లోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా లంపీ స్కిన్ వ్యాక్సినేషన్ చేపట్టడం జరిగింది అని మండల పశు వైద్యాధికారి శేఖర్ తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ ఇందులో భాగంగా ధర్మవరం మండల పరిధిలోని తిప్పేపల్లి గ్రామంలో శర్మ ముద్దా వ్యాధి(లంపి స్కిన్) నివారణకు వ్యాక్సినేషన్ కార్యక్రమం చేపట్టడం జరిగింది అని, సాధారణంగా చర్మముద్ద వ్యాధి పశువులలో వాతావరణంలో మార్పులు ఏర్పడి చల్లని వాతావరణ సమయంలో ఎక్కువగా పశువులకు చర్మంపై బొబ్బలు వచ్చి ప్రాణాంతకంగా మారుతుంది అని తెలిపారు.దీనితో రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. దీని నివారణకు గోట్ ఫాక్స్ వ్యాక్సిన్ మందును పశువులకు వేయడం జరిగింది అని తెలిపారు. వ్యాక్సినేషన్ కార్యక్రమం గోపాలమిత్రలు ఈశ్వరయ్య, శ్రీరాములు, కాటమయ్య ముద్దా వ్యాధి నివారణకు గ్రామంలో దాదాపు 100 పశువులకు వ్యాక్సిన్ వేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు కాయల అంజనప్ప, బత్ర శ్రీరాములు, గుంటకల పురుషోత్తం, వేముల కళ్యాణ్ రెడ్డి, దాడి తోట కిరణ్, మందల శ్రీనివాసులు, పిక్కిరి నారాయణస్వామి పాల్గొన్నారు.

అంగన్వాడీ వర్కర్ ఆత్మహత్యాయత్నానికి కారకులను అరెస్టు చేయాలి

విశాలాంధ్ర-ధర్మవరం: అంగన్వాడీ వర్కర్ నాగమణి ఆత్మహత్యాయత్నానికి కారకులైన ఆంజనేయులు వెంటనే అరెస్టు చేసి ఆంజనేయులు నుంచి నాగమణికి రక్షణ కల్పించాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ఆర్డీవో కార్యాలయంలోని ఏవో లక్ష్మీదేవికి, సిడిపిఓ లక్ష్మీకి వినతి పత్రాలను అందజేశారు. అనంతరం సిఐటియు కన్వీనర్ అయూబ్ కాన్, ఆదినారాయణ, అంగన్వాడి యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు సరస్వతి, చంద్రకళ మాట్లాడుతూ అంగన్వాడి వర్కర్లపై జరుగుతున్న రాజకీయ వేధింపులు తొలగింపులను వెంటనే ఆపాలని వారు డిమాండ్ చేశారు. శ్రీ సత్యసాయి జిల్లాలో ఉన్న అంగన్వాడీ కార్యకర్తలను ఆయాలను అనేక ప్రాంతాలలో రాజకీయ నాయకులు వేధింపులకు తొలగింపులకు గురి చేస్తూ, మా పార్టీ వచ్చింది.. మేమే ఉండాలి.. మీరు రాజీనామా చేయాలన్న వేధింపులు ఇకనైనా ఆపాలని వారు డిమాండ్ చేశారు. అదేవిధంగా ఓ డి సి ప్రాజెక్టు వీరప్ప గారి పల్లి గ్రామంలో పనిచేస్తున్న అంగన్వాడీ కార్యకర్త నాగమణి పై వేధింపులు చేసి కొంతమందిని రెచ్చగొట్టే దురుద్దేశంతో తన కుటుంబ సభ్యులు తీసుకొని స్పందనకు వెళ్లి ఫిర్యాదు చేయడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా అంగన్వాడీ కార్యకర్తలను భయభ్రాంతులకు గురి చేయడం దారుణం అన్నారు. ఇలాంటి ఘటనలు ఒత్తిళ్లు పునరావతం కాకుండా ప్రభుత్వం గట్టి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రాజకీయ వేధింపులు తొలగింపులు ఇలాగే కొనసాగితే పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఎస్ హెచ్ భాషమారుతి, నరసింహులు, అంగన్వాడి నాయకురాలు ఫాతిమా, పోతక్క, సునీత, నూర్జహాన్, మాన్చాలని దేవి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో సౌకర్యాలు కల్పనకు కృషి

- ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్

విశాలాంధ్ర-కదిరి: ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో నూతన డయాలసిస్ కేంద్రాన్ని ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ ప్రారంభించారు. బుధవారం డయాలసిస్ కేంద్రంలో 4 మిషన్లు, ఏఆర్టీ సెంటర్ వద్ద హెచ్ఐవి వైరస్ నిర్ధారణకు సంబంధించిన మిషన్లను ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇటీవల కాలంలో డయాలసిస్ కిడ్నీ సంబంధిత వ్యాదుల బారిన పడుతున్న రోగులను దృష్టిలో ఉంచుకొని డయాలసిస్ రోగులకు 14 బెడ్లు అందుబాటులో ఉంచామని రోజుకు 50 నుండి 60 వరకు చికిత్స పొందుతు న్నారని వైద్యులు తెలిపారు. ఆసుపత్రిలో సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకొని ప్రతి పేదవాడికి కార్పొరేట్ వైద్యం అందించడమే లక్ష్యంగా పని చేస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో అన్ని సౌకర్యాలు ఉంటాయని దాదాపు 10 మండలాల ప్రజలు తమ కొచ్చిన వ్యాదులను నయం చేస్తారని నమ్మికతో వస్తారని ఆసుపత్రిలో పని చేసే వైద్యులు, సిబ్బంది సేవాభావంతో పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో డి ఎచ్ఓ డా. తిప్పేంద్ర నాయక్, సూపరింటెడెంట్ డా. మొహమ్మద్ హుస్సేన్,వైద్య సిబ్బంది, టీడీపీ నాయకులు వాల్మీకి పవన్ కుమార్ రెడ్డి,పర్వీన్ బాను డైమండ్ ఇర్ఫాన్ పాల్గొన్నారు.

సర్వీసులో మంచి సేవలందిస్తేనే గుర్తింపు

విశాలాంధ్ర-ధర్మవరం: ప్రభుత్వ ఉద్యోగంలో సర్వీసులో మంచి సేవలు చేసినప్పుడే రిటైర్మెంట్ అయినప్పుడు మంచి గుర్తింపు లభిస్తుందని ప్రభుత్వ యునాని వైద్యాధికారి డాక్టర్ ఖాదర్, ఎస్. చంద్రయ్య, ఆర్టిఏ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, జిల్లా ఉపాధ్యక్షులు గోపి తెలిపారు. బుధవారం ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రి విభాగములో గల ప్రభుత్వ యునాని వైద్యశాలలో కాంపౌండర్‌గా విధులు కొనసాగిస్తున్న పి.వెంకటరమణ పదవి విరమణ చేశారు. ఈ సందర్భంగా అభినందన సభ ఏర్పాటు చేశారు. అనంతరం డాక్టర్ ఖాదర్, చంద్రయ్య, శ్రీనివాసులు గోపి మాట్లాడుతూ ఉద్యోగంలో మంచి, చెడులు, కష్టాలు, సుఖాలు, సర్వసాధారణంగా ఉంటాయని, కుటుంబ సభ్యులు సహకరించినప్పుడే ప్రభుత్వ ఉద్యోగి తన సర్వీసులో విజయాన్ని సాధిస్తాడని తెలిపారు. అంతేకాకుండా తోటి ఉద్యోగుల పట్ల సమన్వయంతో విధుల సేవలను నిర్వర్తించినప్పుడే నిరంతరం విజయం చేకూరుతుందని తెలిపారు. అనంతరం కాంపౌండర్ వెంకటరమణను అందరూ కలిసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏపీ జీఏ జిల్లా అధ్యక్షులు భాస్కర్ రెడ్డి, ఎల్ఐసి ఏజెంట్ రాజశేఖర్, ధర్మవరం గౌరవ అధ్యక్షులు చెన్న ఆదినారాయణ అధ్యక్షులు చోలిగాళ్ళ కొండప్ప ఏరియా హాస్పిటల్ సిబ్బంది, ఎక్సరే ఆఫీసర్ రామ్మోహను పాల్గొన్నారు.

414 రోజులుగా ఎన్టీఆర్ అన్నాక్యాంటీన్

విశాలాంధ్ర-పెనుకొండ: పెనుకొండలోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ అన్నా క్యాంటీన్ ద్వారా పెనుకొండ నియోజకవర్గ కేంద్రంలో నిరుపేదలకు 414వ రోజులుగా బీసి సంక్షేమం, ఆర్థికంగా బలహీన వర్గాల సంక్షేమం, చేనేత, జౌళి శాఖా మంత్రి సవితమ్మ భోజనం అందిస్తున్నారు. బుధవారం ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కొల్లకుంట అంజినప్ప, సత్య సాయి జిల్లా కురబ సంఘం నాయకులు నాయకులు సామకోటి ఆదినారాయణ, శ్రీనాథ్ చౌదరి, మంత్రి మాట్లాడుతూ పేదలకు పట్టెడన్నం పెట్టడం ద్వారానే ఎంతో సంతృప్తి ఉందని, రాష్ట్ర ప్రభుత్వం కూడా త్వరలో అన్న క్యాంటీన్లు ప్రారంభించబోతుందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో అన్నా కాంటీన్లు మూసి పేదల కడుపుకొట్టారని దుయ్యబట్టారు. అలాగే ప్రజలతో కలిసి భోజనం చేసి నాణ్యతను తెలుసుకొని మీరు ఎక్కడి నుంచి వచ్చారు. దీనివల్ల ఉపయోగం ఉందా లేదా అని తెలుసుకున్నారు.

కాలేజీ విద్యార్థులకు మంత్రి సవితమ్మ పుస్తకాలు పంపిణీ

విశాలాంధ్ర-పెనుకొండ : పెనుకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు నోటుపుస్తకాలు, బ్యాగు, చదువుకు అవసరమైన కిట్లను బుధవారం బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ అందజేశారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి మంత్రి సవితమ్మ మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విదంగా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం విద్యార్థులను దృష్టిలో ఉంచుకొని కళాశాలలు ప్రారంభం కాగానే ఉచితంగా పుస్తకాలు,బ్యాగులు అందచేస్తున్నామని, కావున ప్రతి విద్యార్థి దశ నుంచి చదువుపట్ల ఆసక్తితో పాటు లక్ష్యాన్ని ఏర్పరచుకొని దానిని సాధించేందుకు కృషి చేయాలని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాన్ విద్యాశాఖ మంత్రి వర్యులు నారా లోకేష్ విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు.. భవిష్యత్తులో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలో మరిన్ని అభివృద్ధి పథకాలను అమలుచేసి కూటమి ప్రభుత్వంలో విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయనున్నాన్నమని తెలియచేసిన బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ. ఈకార్యక్రమంలో జూనియర్ ప్రిన్సిపాల్ మధుసూదన్, కళాశాల సిబ్బంది మరియు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సకాలంలో పింఛన్లను పంపిణీ చేస్తాము

- మున్సిపల్ కమిషనర్ రాముకుమార్

విశాలాంధ్ర-ధర్మవరం: ప్రభుత్వ ఆదేశాల మేరకు పట్టణము మండల పరిధిలోని గ్రామాలకు సకాలంలో పెన్షన్లను పంపిణీ చేస్తామని పురపాలక కమిషనర్ రామ్కుమార్, ఇంచార్జ్ అబ్దుల్ నబీ తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ పట్టణంలో 18,419 మంది పెన్షన్లకు 21 రకాలుగా 7 కోట్ల 94 లక్షల 63 వేల రూపాయలను పంపిణీ చేస్తున్నట్లు వారు తెలిపారు. అదేవిధంగా మండల పరిధిలోని 20 పంచాయితీలు 14 సచివాలయ లలో ప్రకారం 6,882 మంది పెన్షన్ దారులకు (21 రకాలు)2 కోట్ల 99 లక్షల 98 వేల 500 రూపాయలను పంపిణీ చేస్తున్నట్లు ఇన్చార్జ్ ఎంపీడీవో అబ్దుల్ నబీ తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగుల ద్వారా ఆగస్టు ఒకటవ, రెండవ తేదీలోపు పెన్షన్ దారులకు అందే విధంగా అన్ని చర్యలను చేపట్టడం జరిగిందని తెలిపారు.

ఎక్కడా ఎటువంటి అవకతవకలు లేకుండా కూడా చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు. సాధ్యమైనంతవరకు ఆగస్టు 1వ తేదీ రాత్రి లోపే పంపే విధంగా సచివాలయ ఉద్యోగులకు ఆదేశాలు కూడా ఇవ్వడం జరిగిందని తెలిపారు. కావున పెన్షన్దారులు తమ ఇంటి వద్దనే అందరూ ఉండాలని, సచివాలయ ఉద్యోగులు మీ ఇంటి వద్దకే వచ్చి తమ పెన్షన్ పంపిణీ చేస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

పేదలకు సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యం

- ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి
- 166 మంది ఎస్సీ రైతులకు వ్యవసాయ పరికరాలు అందజేత

విశాలాంధ్ర-పుట్టపర్తి: పేదలకు సంక్షేమ పథకాల అందించడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పుట్టపర్తి మండలం పెడబల్లి సహకార సొసైటి కార్యాలయంలో 46 మందికి , బుక్కపట్నం మండలంలో 120 మందికి ఎస్సీ కుటుంబాల రైతులకు సుమారు 16లక్షల 6 వేలు విలువ చేసే వ్యవసాయ పరికరాలు ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి తో పాటు మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రభుత్వం అందించే వ్యవసాయ పరికరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏ ఒక్క మధ్యవర్తికి వీటి కోసం డబ్బులు ఇవ్వద్దన్నారు. ,ఇచ్చినట్లు తన దృష్టికి వస్తె వాటిని రద్దు చేస్తానని హెచ్చరించారు. ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను తప్పకుండా అమలు చేస్తామన్నారు. అందులో భాగంగా వచ్చే మాసం నుంచి ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం అమల్లోకి రానున్నట్లు తెలిపారు. టీడీపీ ఇచ్చిన హామీలను దశల వారీగా అమలు చేస్తామని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి పేర్కొన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో దౌర్భాగ్యమైన పాలన సాగిందని మండిపడ్డారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమగ్రఅభివృద్ధి జరుగుతుందని తెలిపారు. ఆగస్టు 1 న సత్యసాయి జిల్లా మడక శిర లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సామాజిక పింఛన్లు పంపిణీ కార్యక్రమం ఉంటుందని, ఈ కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. పుట్టపర్తి మండలం పెడబల్లి లోసుమారు 46 మంది ఎస్సీ రైతు కుటుంబాలకు , బుక్కపట్నం మండలంలో 120 ఎస్సీ కుటుంబాలకు డ్రమ్ములు , టార్పోలిన్ లు పంపిణీ చేశారు. ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున మొత్తం 166 యూనిట్లు కలిపి మొత్తం రూ.16 లక్షల వేలు విలువ చేసే వ్యవసాయ పరికరాలు అందజేశారు.

హంగు ఆర్భాటాలు లేకుండా ప్రజలతో చంద్రబాబు ముఖాముఖి

- గుండుమలకు ప్రజలు రావద్దు
- సీఎం కార్యక్రమాన్ని ఎల్ఈడి ద్వారా వీక్షించండి
- ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి

విశాలాంధ్ర-అగళి : ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మడకశిర నియోజకవర్గం గుండుమల గ్రామంలో నిర్వహించే ప్రజావేదిక కార్యక్రమానికి విచ్చేస్తున్న సందర్భంగా నియోజకవర్గ ప్రజలు గుండుమల కు రావద్దని వారి వారి ప్రాంతాల్లోనే ఎల్ఈడి స్క్రీన్ ద్వారా వీక్షించాలని ఎమ్మెల్యే ఎం ఎస్ రాజు, నియోజకవర్గ ఇంచార్జ్ గుండుమల తిప్పేస్వామి తెలిపారు. మడకశిరం మండల పరిధిలోని గుండుమల గ్రామంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వృద్ధులకు పెన్షన్ కార్యక్రమంలో పాల్గొని అనంతరం ప్రజా వేదిక కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. నియోజకవర్గ ప్రజలకు చేతులు జోడించి నమస్కరిస్తూ ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు నియోజకవర్గంలోని ప్రజలందరూ మీ మండలాల్లో పట్టణాల్లో ఎల్ఈడీ టీవీల ద్వారా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కార్యక్రమాన్ని వీక్షించాలని నియోజకవర్గ ప్రజలకు కార్యకర్తలకు నాయకులకు ఆయన సూచించారు. మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి మాట్లాడుతూ నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి గా బాధ్యత లు చేపట్టాక ఉమ్మడి జిల్లాలోని మడకశిర నియోజకవర్గానికి మొదటిసారిగా వస్తున్నారని నియోజక వర్గంలో ప్రజలందరికీ చంద్రన్న పండుగలు జరుపుకుంటున్నారని ఆయన తెలిపారు. నియోజకవర్గంలో నాయకులు కార్యకర్తలు ప్రజలందరూ వారి వారి మండల పట్టణ ప్రాంతాల్లో ఎల్ఇడి టీవీల ద్వారా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కార్యక్రమం వీక్షించాలని ముఖ్యమంత్రి చెప్పినట్టు హంగు ఆర్భాటాలతో సమావేశం కార్యక్రమాలు ఉండకూడదని ఎక్కడ కూడా పరదాలు కాని కట్టించవద్దని. చెట్లు కూడా ఎక్కడ తొలగించవద్దని చంద్రబాబు సూచించారని తెలిపారు. ప్రజా వేదిక ద్వారా సామాన్య ప్రజలతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహిస్తారన్నారు. కలెక్టర్ చేతన్, ఎస్పి రత్నలు మాట్లాడుతూ గుండుమల గ్రామంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విచ్చేస్తున్న సందర్భంగా గుండుమల పంచాయతీ ప్రజలు మాత్రమే ముఖ్యమంత్రితో ముఖాముఖి కార్యక్రమం ప్రజా వేదికపై మాట్లాడే విధంగా ఏర్పాటు చేసామన్నారు

విశాలాంధ్ర అనంతపురం/సత్యసాయి
www.visalaandra.com
కర్నూలు, గురువారం 1, ఆగస్టు 2024

పుస్తకాలు మన జీవితాన్ని ఒడ్డుకు చేర్చేవి

- ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

విశాలాంధ్ర-కదిరి : విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలంటే నైపుణ్యంతో కూడిన విద్యతో పాటు కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ బాలుర కళాశాలలో విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ ఇంటర్ చదివే విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే కంది కుంట వెంకట ప్రసాద్ విద్యార్థులను ఉత్తేజ పరుస్తూ ఒత్తిడి కంఠస్థం తో కూడిన విద్యను అభ్యసిస్తే అది ఏమాత్రం ఉపయోగకరంగా ఉండదని ప్రతిఒక్కరూ ఏకాగ్రతతో పాటు ప్రణాళిక బద్ధంగా చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విపులంగా వివరించారు. ఒక ఇంజనీరు అసమర్థుడైతే ఒక కట్టడం కూలిపోవచ్చని, వైద్యుడు తప్పు చేస్తే రోగి ప్రాణం పోవచ్చని కానీ ఒక ఉపాధ్యాయుడు అసమర్థంగా ప్రవర్తిస్తే సమాజం మొత్తం అంధాకారంలోకి పయనించే అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పవన్ కుమార్‌రెడ్డి పట్టణ అధ్యక్షులు డైమండ్ ఇర్ఫాన్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

భూ కబ్జాలకు పాల్పడితే కఠిన చర్యలు..

-పార్టీలకతీతంగా ప్రజాలకు సేవలు చేద్దాం

- మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే కాలువ

విశాలాంధ్ర-బొమ్మనహాల్ : పలుకుబడి ఉన్నవారు ధనవంతుడు, బలవంతుడు రాజకీయ పలుకుబడితో భూ కబ్జాలకు ఎక్కువగా పాల్పడ్డారని, ఆ పరిస్థితి ఇక్కడ ఉంటే ప్రజాప్రతినిధులుగా ఉన్న మేము వాటిని అడ్డుకోవాల్సిన బాధ్యత ఉందని రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు అన్నారు. బుధవారం బొమ్మనహాళ్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పద్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశానికి ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వ్యవసాయ, విద్య, విద్యుత్, ఎన్‌ఆర్‌ఈజీఎస్ తదితర శాఖలపై సమీక్ష సమావేశం జరిగింది. బడి మానేసిన పిల్లలను 93 మందిని బడిలో చేర్పించామని ఎంఈఓ చెప్పారు. మండలంలో 93 మంది అయినా మరి ఎక్కువగా ఉన్నారని దాన్ని మేము నిరూపిస్తామని ప్రత్యేక శ్రద్ధ పెట్టి తీసుకుని పిల్లలను బడిలో చేర్పించాలని కాలవ శ్రీనివాసులు చూపించారు. రాష్ట్రంలోని బొమ్మనహాల్ మండలం బాల్య వివాహాల్లో మొదటి స్థానంలో ఉందని దాన్ని అరికట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. సమావేశం ఉద్దేశించి కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ కొన్ని రోజులుగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ బాబుకు స్వీకరిస్తున్న వినతులలో 50 శాతం భూ కబ్జాలవే ఉన్నాయని, మన మండలంలో అలాంటివి జరిగితే వాటిని అరికట్టాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధుపైనే ఉందన్నారు. ధనవంతులు, బలవంతులు పేద రైతుల భూములను లాక్కుంటే చాలా దుర్మార్గమని అన్నారు. మండలంలో అలాంటివి జరిగే ఉంటే వాటిని గుర్తించి పేద రైతులకు న్యాయం చేయాలని కాలవ శ్రీనివాసులు అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని 2014 నుండి 2019 వరకు అప్పటి మంత్రి నారా లోకేష్ చొరవతో మన ప్రాంతాల్లో సిసి రోడ్లు, ఎల్ఈడి బల్బులు, డ్రైనేజీలు మౌలిక వసతులు కల్పించడం జరిగిందని గుర్తు చేశారు. పార్టీలు వేరు కావచ్చు ప్రజాసేవ చేయడంలో అందరూ కలిసికట్టుగా పార్టీలకు అతీతంగా సేవ చేద్దాం రాజకీయాలు వేరు ప్రజాసేవ చేయడం వేరు అని కాలవ శ్రీనివాసులు తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీడీవో రఘునాథ్, ఈఓపిఆర్డి దాస్, విద్యుత్ ఏఈ లక్ష్మం రెడ్డి, ఏఓ సాయికుమార్, జేఈఈ జగదీష్, చైతన్య, ఎంపీటీసీ సభ్యులు ముల్లంగి నాగమణి, కల్పన, తిమ్మప్ప, సర్పంచ్ వనమ్మ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల హెల్త్ స్కీం ప్రీమియం మేమే చెల్లిస్తాం..

ఎమ్మెల్యే పల్లె సింధూర,మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి

విశాలాంధ్ర-పుట్టపర్తి : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాత్రికేయుల సంక్షేమానికి పెద్దపీట వేశారని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డిలు పేర్కొన్నారు. గత కొన్ని ఏళ్లుగా పుట్టపర్తి నియోజకవర్గంలోని పాత్రికేయులకు హెల్త్ స్కీం కింద ప్రభుత్వానికి చెల్లించే ప్రీమియం డబ్బులు తానే చెల్లిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏటా 2024 కూడా అందరికీ ప్రీమియం చెల్లిస్తామని ముందుకు వచ్చారు. ఈ అవకాశం కల్పించిన భగవంతుడు, నాతోటి పాత్రికేయులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం జిల్లా ఏపీడబ్ల్యూజే నేతలు వారిని కలిసి జర్నలిస్టు సమస్యలను వివరించగా సానుకూలంగా స్పందిస్తూ ఎంతో మానసిక ఒత్తిడికి గురవుతున్న జర్నలిస్టులు, వారిపై ఆధారపడ్డ కుటుంబ సభ్యులకు ఏదైనా అనుకోని అనారోగ్యం సంభవించిన ప్రతిసారి రూ.2లక్షల వరకు వైద్య సేవలు అందుతాయన్నారు. ఇలా ఏడాదిలో ఎలాంటి పరిమితులు లేకుండా ఎన్నిసార్లైనా ఈ సదుపాయాన్ని అందుకోవచ్చు అన్నారు. ఎంప్లాయిస్ హెల్త్ స్కీమ్ తరహాలో వర్కింగ్ జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్ ద్వారా జర్నలిస్టులకు వైద్య సేవలు ఉంటాయన్నారు.వర్కింగ్ జర్నలిస్ట్ హెల్త్ స్కీం ద్వారా పొందే వైద్య సేవల విషయంలో ఎలాంటి ఆదాయ పరిమితులు లేవన్నారు. నిర్దేశిత చికిత్సలకు సంబంధించి ఉచిత ఓపి సేవలు పొందవచ్చు అన్నారు. గతంలో సైతం పలుమార్లు ఈ నియోజకవర్గ జర్నలిస్టుల కోసం జర్నలిస్ట్ హెల్త్‌స్కీం ప్రీమియం చెల్లించడం జరిగిం దన్నారు. తన రాజకీయ భవిష్యత్తు కోసం జర్నలిస్టులు ఎంతో దోహదపడ్డారని, అలాంటి జర్నలిస్టుల సంక్షేమం కోసం తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయి అన్నారు. జర్నలిస్టులు అందరూ ఈ హెల్త్ స్కీమును సద్వినియోగం చేసుకొని వారితో పాటు వారి కుటుంబ సభ్యులందరూ ఆరోగ్యవంతంగా ఉండాలని వారు ఆకాంక్షించారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం వారు స్పందించిన తీరు పట్ల జర్నలిస్టులందరూ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

పదో తరగతి సిలబస్ మార్పులతో విద్యార్థులకు తీవ్ర నష్టం..

విశాలాంధ్ర-ధర్మవరం: పదవ తరగతి విద్యార్థులకు మారిన టెక్స్ట్ బుక్‌లో ఉన్నటువంటి కంటెంట్, పాఠాలు భవిష్యత్తులో విద్యార్థులకు ఏమాత్రం ఉపయోగపడే విధంగా లేవని, దీనివల్ల విద్యార్థులకు తీవ్ర నష్టం జరుగుతుందని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు శెట్టిపి జయ చంద్రారెడ్డి తెలియజేశారు. ఈ సందర్భంగా ధర్మవరం యుటిఎఫ్ కార్యాలయంలో స్థానిక ధర్మవరం జోన్ నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సరం మారిన 10వ తరగతి సోషల్ టెక్స్ట్ బుక్ లో 258 పేజీలు ఉంటే 167 పేజీలు యూరోపియన్ చరిత్రకు కేటాయించి, రాష్ట్ర చరిత్రకు అత్యంత తక్కువ పేజీలు ఇవ్వడం విద్యార్థులకు ఎలా ఉపయోగమో చెప్పాలని కోరారు. గత సంవత్సరం 9వ తరగతి హిందీ పుస్తకం చాలా ఇబ్బందికరంగా ఉందని, ఉపాధ్యాయులకు కూడా అర్థం చేసుకోలేని ఉత్తర భారత దేశం మాండలికాలు ప్రవేశపెట్టడం వల్ల విద్యార్థులను, ఉపాధ్యాయులను గందరగోళానికి గురిచేసిందని, గతంలో అధికారుల దృష్టికి తీసుకువచ్చిన, ఈ సంవత్సరం పదవ తరగతి టెక్స్ట్ బుక్ అదే పద్ధతిలో ముద్రించటం విద్యార్థులకు హిందీ భాష పట్ల ఆసక్తిని తగ్గించే ప్రక్రియను చేపట్టారనే అనుమానాన్ని వ్యక్తపరిచారు. భౌతికశాస్త్రంలో మూలకాల వర్గీకరణ, పరమాణు నిర్మాణం, రసాయన బంధం లాంటి పాఠాలు తొలగించి వేయటం అత్యంత దారుణమని విమర్శించారు. జీవో 117ను రద్దు చేయడం, సమాంతర మీడియాలను కొనసాగించడం ,ప్రాథమిక పాఠశాల అంటే ఒకటి నుంచి ఐదు తరగతుల వరకు కొనసాగుతాయి అని, తక్షణ నిర్ణ యాలు తీసుకోవాలని, నూతన ప్రభుత్వమును డిమాండ్ చేశారు. కార్యక్ర మంలో ధర్మవరం జోన్ యుటిఎఫ్ నాయకులు రామకృష్ణనాయక్, ఆంజనే యులు, లక్ష్మయ్య, అమర్ నారాయణరెడ్డి, రాంప్రసాద్, హరికృష్ణ,సాయి గణేష్, రామాంజనేయులు, ఆదిశేషు, జనార్ధన్ బాబు, వెంకట కిషోర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆర్థిక సహాయం..

విశాలాంధ్ర-కదిరి : పట్టణంలో స్థానిక బాలికల పాఠశాల సమీపంలో మనుస్ డ్యాన్స్ అకాడమీలో శిక్షణ పొందుతున్న విద్యార్థులకు కళ్యాణి జ్యువెలర్ దంపతులు వెంకటరమణ (6వేలు)ఆర్థిక సహాయం అందించినట్లు డ్యాన్స్ మాస్టర్ తేపల్లి మనోహర్ తెలిపారు. తల్లి ఉండి తండ్రి లేని, తండ్రి ఉండి తల్లి లేకపోయిన ఇరువురు విద్యార్థులు రోషన్, ప్రియాంక లు ఇటీవల కాలంలో పలు టీవీ షోలలో తమ డ్యాన్స్ టాలెంట్ తో ప్రత్యేక ప్రతిభ కనపరుస్తున్న విద్యార్థులకు తమ వంతుగా సహాయం అందిస్తున్నామని భవిష్యత్‌లో మరింత మందికి తమవంతు సహకారం ఉంటుందని భరోసా ఇచ్చారు. దాతలను శాలువాతో సత్కరించారు.

నేడు అంతర గంగకు మంత్రి రాక..

విశాలాంధ్ర-కూడేరు: గురువారం ఉదయం 9 గంటలకు ఉరవకొండ నియోజకవర్గంలోని కూడేరు మండలం అంతరగంగ గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పథకం కింద పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పాల్గొంటారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే కందికుంట

విశాలాంధ్ర-తలుపుల: మండల పరిధిలోని పెద్దన్నవారిపల్లి గ్రామంలో బుధవారం తెలుగుదేశం నాయకులు మేడా శంకర్ సమక్షంలో సాయిని కేతన్ సొసైటీ ఫర్ రూరల్ డెవలప్మెంట్ వారి ఆధ్వర్యంలో వైదేహి సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ వారు బుధవారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. వైద్య శిబిరానికి ముఖ్యఅతిథిగా కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరం పెట్టి ప్రజలకు వైద్య సేవలు అందించడం అభినందనీయమని, అలాంటి ఆలోచన వచ్చినందుకు మనస్ఫూర్తిగా అభినందిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు కూడా వీటిని వినియోగించుకోవాలని తెలిపారు. పెద్దన్నవారిపల్లి పంచాయతీలోని వడ్డేపల్లి గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని, వినతిపత్రం ఇవ్వడంతో ప్రతి గ్రామ పై తనకు పట్టు ఉందని, ఏ గ్రామానికి ఏం అవసరమైనది తనకు తెలుసని ప్రతి గ్రామానికి అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అందరి మాదిరిగా మాటలు కాకుండా తాను అభివృద్ధి చేసి చూపిస్తానని పేర్కొన్నారు. వచ్చిన రోగులకు వైద్య సేవలతో పాటు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ అల్తాఫ్ టీడీపి మండల కన్వీనర్ ముబారక్, మనోహర్ రెడ్డి, విజయ రెడ్డి, గంగరాజు, ఓబుల్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, జయచంద్ర, రామ్మోహన, కొమ్మెర శ్రీనివాసులు,జనసేన నాయకురాలు సీతమ్మ, భార్గవ్ రెడ్డి పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే మనందరి కర్తవ్యం

పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి

విశాలంధ్ర-బుక్కపట్నం: గ్రామాల అభివృద్ధి మన అందరి లక్ష్యంగా ఉండాలని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ప్రజా ప్రతినిధులకు, అధికారులకు పిలుపునిచ్చారు. బుక్కపట్నం ఎంపిడిఓ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రజలకు మనమంతా జవాబు దారిగా పనిచేద్దామని చెప్పారు. గ్రామంలో ఎక్కడ త్రాగునీటి సమస్య రాకుండా చూడాలని అధికారులకు ఆదేశించారు. మండలంలో చిలకల గడ్డపల్లి, మధురేబైలు, గోపాలపురం, యాదా లంక పల్లి, మదురే బైలు తాండా, యర్లంపల్లి, నాయన వారిపల్లి, జీఎర్ కొట్టాల లో తాగునీటి సమస్య ఉన్నట్లు ప్రజల నుంచి తనకు ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. తక్షణం అన్ని పంచాయతీల్లో ఉన్న వాటర్ ట్యాంకులను వారంలో ఒకరోజు శుభ్రం చేసి ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందిచాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. గ్రామాల్లో పారిశుధ్యంపై ఎక్కడ నిర్లక్ష్యం చేయొద్దని కార్యదర్శులను హెచ్చరించారు. వర్షాకాలం సీజన్ ప్రారం భమైందని గ్రామాల్లో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలన్నారు. చెరువులు కుంటలు,గట్లు పటిష్టంగా ఉండేలా ముందస్తుగా చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాకాల సమయంలో అన్ని ప్రభుత్వ కార్యాలయ ఆవరణలో, ప్రభుత్వ పాఠశాలల్లో మొక్కలు తప్పనిసరిగా నాటే కార్యక్రమానికి పుట్టపర్తి నియోజకవర్గం నుంచే నాంది పలకాలన్నారు.

పొలం బడిపై రైతులకు అవగాహన

విశాలాంధ్ర-తాడిపత్రి : పెద్ద పప్పూరు మండలం సోమనపల్లి గ్రామంలో బుధవారము మండల వ్యవసాయ అధికారి ఆంజనేయులు అధ్యక్షతన ఖరీఫ్ 2024 సంవత్సరానికి సంబంధించి మొక్కజొన్న పంటలో ఇన్ద్ గ్యాప్ పొలం బడి, క్యూఎంఎస్ టీం ఎంపిక, పొలం బడి రైతుల ఎంపిక, పొలం బడి ప్లాట్ ఎంపిక, గ్రామ సభ, బ్యాలెట్ బాక్స్, విత్తన శుద్ధి కార్యక్రమాలు చేపట్టారు. ముఖ్యఅతిథి ఏడీఏ చెంగల్ రాయుడు మాట్లాడుతూ మాట్లాడుతూ ఇండ్ గ్యాప్ పొలం బడికి సంబంధించి క్యూఎంఎస్ టీం మెంబెర్స్ ని రైతులకి పరిచయం చేసి, పొలం బడి సెషన్స్ ఎన్ని, ఏఏ సెషన్స్ నందు ఏ కార్యక్రమాలు నిర్వహించాలో రైతులకి తెలియజేశారు. అలాగే మండల వ్యవసాయ అధికారి ఆంజనేయులు మాట్లాడుతూ పొలం బడి ముఖ్య ఉద్దేశం తక్కువ పెట్టుబడితో ఎక్కువ నికర ఆదాయం, నాణ్యమైన దిగుబడి, మట్టి పరీక్షలు చేయించుకొని వాటిని బట్టి ఎరువుల నిర్వహణ అనుసరించాలని, సేంద్రియ ఎరువుల వడవలేనని చెప్పారు.

టమోటా లోడ్ వాహనాన్ని ఢీకొన్న లారీ

టమోటా లోడ్ వాహన డ్రైవర్ మృతి

విశాలాంధ్ర-పెనుకొండ: పెనుకొండ మండల పరిధిలో బుధవారం రోడ్డు ప్రమాదం జరిగింది. పెనుకొండ సమీపంలోని జాతీయ రహదారీ పై పుట్టపర్తి బ్రిడ్జి సమీపంలో లారీ అదుపు తప్పి బెంగళూరు నుండి హైదరాబాదు వెళ్తున్న టమోట లోడు వాహనాన్ని ఢీ కోట్టింది. ఈ సంఘటనలో టమొటా లోడ్ వాహన డ్రయివరు శ్రీనివాసులు(35) మృతి చెందాడు. మృతుడిది కోలార్ జిల్లా మాలూరు గ్రామం టమోటా లారీ కోలార్ నుంచి రాయపూర్ వెళ్తుండగా అధిక వేగంతో పోయి అదుపుతప్పి డివైడర్ పెట్టి అవతల వైపు ప్రయాణిస్తున్న బంగాళదుంప లారీని కొట్టింది. బంగాళదుంప లారీ మరల కంటైనర్‌ను ఢీకొట్టగా ముగ్గురికి తీవ్రంగా గాయాలయ్యాయి. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రాజేష్ తెలిపారు.

పరిశ్రమ-విద్యాపరమైన భాగస్వామ్యమే లక్ష్యం

విశాలాంధ్ర-గోరంట్ల: పరిశ్రమ-విద్యాపరమైన భాగస్వామ్యం పెంపొందించడమే లక్ష్యంగా వినూత్న స్టార్టప్ అని ప్రో వైస్-ఛాన్సలర్ డాక్టర్ అనురాధ ధర్ తెలిపారు. మండలంలోని భారతీయ ఇంజినీరింగ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఇన్నోవేషన్ యూనివర్సిటీ, బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ (బిట్స్) పూర్వ విద్యార్థులచే స్థాపించబడిన ఒక వినూత్న స్టార్టప్ అయిన నెక్స్ట్ వేవ్‌తో సహకారాన్ని ప్రకటించడానికి శ్రీకారం చుట్టారన్నారు. ఈ సహకారం పరిశ్రమ-విద్యాపరమైన భాగస్వా మ్యాలను లక్ష్యంగా చేసుకుంది, ఇది ఈ ప్రాంతంలో సాంకేతిక పురోగతులు, వ్యవస్థాపక వృద్ధిని పెంచుతుందన్నారు. విద్యార్థులు, అధ్యాపకులకు అత్యాధునిక వనరులు వాస్తవ-ప్రపంచ పరిశ్రమ అనుభవానికి ప్రాప్యతను అందిస్తుందన్నారు. బెస్ట్ ఇన్నోవేషన్ యూనివర్సిటీతో కలిసి పని చేయడం తదుపరి తరం ఆవిష్కర్తలు, వ్యవస్థాపకుల అభివృద్ధికి తోడ్పడటం మాకు గర్వ కారణం" అని నెక్స్ట్ వేవ్ అని ఆశాభావం వ్యక్తంచేశారు.

బహుజన చైతన్య వేదిక ద్వారా ఆత్మీయ సన్మానం..

విశాలాంధ్ర-పెనుకొండ : పెనుకొండ నియోజకవర్గం రహదారులు భవనాలు అతిథి గృహంలో బుధవారం ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్ ఏపీఎస్పీ డీసీఎల్, ఆపరేషన్స్, జనరల్ మేనేజర్ డీఎస్ వరకుమార్‌ను విద్యుత్ శాఖ ఎస్ ఈఆపరేషన్స్ సంపత్‌కుమార్‌ని బహుజన చైతన్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు హైకోర్టు అడ్వకేట్ శివరామ కృష్ణ మరియు బహుజన చైతన్య వేదిక బృందం సభ్యులు కలిసి శాలువా మరియు పుష్పగుచ్ఛంతో ఆత్మీ యంగ సన్మానించారు. కార్యక్రమంలో వెంకటేశులు, హనుమంతు, బాబు, ప్రసాద్, రవికుమార్, నాగరాజు, ఈశ్వర్, రామాంజనేయులు, కదిరప్ప, నరసింహులు, హనుమంత నాయక్ తదితరులు పాల్గొన్నారు.

5న సర్వసభ్య సమావేశం...

విశాలాంధ్ర-అగళి : స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఈనెల 5న సోమవారం ఉదయం 10:30 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తునట్లు ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, పరిపాలనాధికారి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే ఎంఎస్ రాజు పాల్గొంటారన్నారు. జిల్లా పరిషత్ ప్రాదేశిక సభ్యులు, మండల అధ్యక్షులు, మండల ఉపాధ్యక్షులు, కోఆప్షన్ సభ్యులు, ఎంపీటీసీలు, సర్పంచులు అన్ని శాఖల మండల స్థాయి అధికారులు,ప్రగతి నివేదికలతో తప్పక హాజరుకావాలని తెలిపారు. హాజరుకాని అధికారులపై చట్ట పరమైన చర్యలు నియమిత్తం ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు.

పంట యజమాన్య పద్ధతులు పాటించాలి..

విశాలాంధ్ర-రొద్దం: మండలంలోని పెదమంతూరు పొలాల్లో బుధవారం జిల్లా వ్యవసాయ అధికారి వైవి సుబ్బారావు ఆధ్వర్యంలో పత్తి మొక్కజొన్న తదితర వంటలు యజమాన్య పద్ధతులు ను రైతులకు అవగాహన కల్పించారు. పంటలు వివిధ దశల్లో సోకే తెగుళ్ల వ్యాధులు వైరస్లు వాటికి వాడవలసిన మందులు మోతాదు గురించి రైతులకు తగిన సలహాలు అందజేశారు. కార్యక్రమంలో పెను గొండ సహాయ వ్యవసాయ సంచాలకులు స్వయంప్రభ మండల వ్యవసాయ అధికారి నివేదిత, వ్యవసాయ సహాయకులు యోగేష్ రైతులు పాల్గొన్నారు.

ఎన్నికల టీఏ, డీఏ డబ్బులివ్వాలి

విశాలాంధ్ర-కొత్తచెరువు: పుట్టపర్తి నియోజకవర్గంలోనే 6 మండలాల్లో సార్వత్రిక ఎన్నికలలో విధులు నిర్వర్తించారని వారికి టీఏ, డీఏ డబ్బులు ఇవ్వాలని ఆర్డీవో కార్యాలయంలో అధికారి ఉదయ్‌కు వినతి పత్రం అందజేసిన రాష్ట్ర విఆర్‌ఏల సంఘం అధ్యక్షుడు ఎన్ పెద్దన్న, మరియు వీఆర్‌ఏలు ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు పూర్తయి రెండు నెలలు అయినప్పటికీ తమకు డబ్బులు ఇవ్వలేదు అన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తమకు తక్షణమే డబ్బులు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో వీఆర్ ఏలు శివ, సాయి, గంగాధ పాల్గొన్నారు.

ఫ్లోరోసిస్ బాధితులకు ఉపకరణాలు అందజేత..

విశాలాంధ్ర-శింగనమల : మండల పరిధిలోని కల్లుమడి గ్రామములో తరిమెల వైద్యాధికారి డాక్టర్ శంకర్‌నాయక్ ఆధ్వర్యంలో ఫ్లోరోసిస్ బాధితులను గుర్తించి అందులో భాగంగా ఎముకలలో పట్టుత్వం తగ్గిన వారికి ప్రభుత్వం ఉచితంగా సపోర్టింగ్ ఉపకరణాలైన లంబార్ బెల్ట్స్, వాకర్స్, హ్యాండ్ స్టిక్స్ ఉచితంగా మొదటి విడతగా కొంత మంది లబ్ధిదారులకు కల్లుమడి గ్రామంలో బుధవారం తరిమెల వైద్యాధికారి డాక్టర్ శంకర్ నాయక్ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. హెల్త్ ప్రొవైడర్ శ్వేత,ఆరోగ్య కార్యకర్త మోహనమ్మ,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు పోస్టల్ ప్రమాద బీమా చేయించిన రెడ్డి జేఏసీ అధ్యక్షుడు

విశాలాంధ్ర-హిందూపురం : స్థానిక ప్రెస్ క్లబ్‌లో నూతనంగా ఎన్నిక కాబడిన ప్రెస్ క్లబ్ కమిటీకి, జర్నలిస్టులపై అభిమానంతో, రెడ్డి జేఏసీ అధ్యక్షులు వెంకటేష్ రెడ్డి నేనున్నానంటూ జర్నలిస్టులకు పోస్టల్ ఇన్సూరెన్స్ (ప్రమాద బీమా) బుధవారం చేయించారు. రెడ్డి జేఏసీ అధ్యక్షులు వెంకటేష్‌రెడ్డి మాట్లాడుతూ, సమాజం కోసం ఎంతగానో కృషి చేస్తున్న జర్నలిస్టులు వార్తలు సేకరించే క్రమంలో, వారి కృషి ఎంతో అభినందనీయమని, దురదృష్టవశాత్తు ఏదైనా ప్రమాదానికి గురైతే వారి కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులకు గురికాకూడదనే నా గొప్ప ఆలోచనతో, జర్నలిస్టులకు పోస్టల్ ఇన్సూరెన్స్‌ను చేయించాలని నిర్ణయించుకున్నామని, ఈ ఇన్సూరెన్స్‌ను ఐదేళ్లు నేనే స్వయంగా నగదును చెల్లిస్తానని రెడ్డి జేఏసి అధ్యక్షులు వెంకటేష్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వెంకటేష్ రెడ్డికి ప్రెస్ క్లబ్ కమిటీ అధ్యక్షులు రామాంజనేయులు, కార్యదర్శి ప్రశాంత్, గౌరవ అధ్యక్షులు ప్రకాష్ ఉపాధ్యక్షులు రమేష్, అల్లిపిరా, రమేష్, సలహాదారులు సురేష్ రెడ్డి ప్రధాన కార్యనిర్వాహక అధ్యక్షులు షబ్బీర్, సహాయ కార్యదర్శులు రాజేష్, చరణ్, జబీబుల్లా కమిటీ నెంబర్లు కృతజ్ఞతలు తెలుపుతూ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ సీనియర్ మేనేజర్ మురళి తోపాటు డి.ఓ.పి.ఎల్.ఐ నరసింహమూర్తి, డి జి.ఎస్.బి.పి.ఎం. ఎస్ నాగరాజు రావు, మౌలాలి, నాగమణి, హరి లింగేశ్వర్, సురేఖ, తేజస్విని, తిప్పేస్వామి పాల్గొన్నారు.

నూతన బేకరిని ప్రారంభించిన బీజేపీ జిల్లా అధ్యక్షులు..

విశాలాంధ్ర-గోరంట్ల: గోరంట్ల పట్టణంలోని వెంకటేశా చారి నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ రాఘవేంద్ర స్వీట్స్ అండ్ కేక్ హౌస్‌ను బిజెపి సత్యసాయి జిల్లా అధ్యక్షులు జి.యం.శేఖర్ స్వామి రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు, బేకరి యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలియ చేసారు, ఈ సందర్భంగా జీఎం శేఖర్ ను పెద్దలను బేకరి సన్మానించారు, ఈ కార్యక్రమంలో జి.యం. సురేష్ స్వామి, ఈశ్వర్‌రెడ్డి, మేదర శ్రీనివాసులు పాల్గొన్నారు.

చదువే జ్ఞానం.. చదువే సమాజం దీపం.. డీఈఓ

విశాలాంధ్ర-లేపాక్షి: గ్రామీణ ప్రాంతాలలో నిరుపేద కుటుంబాల నుండి విద్యార్థులు ఆణిముత్యాల ఉన్నత స్థాయికి చేరుకుంటున్నారంటే విద్య నేర్పే గురువు విద్యార్థులకు స్నేహితుడై విద్యాబుద్ధులు నేర్పితే చదువే జ్ఞానం చదువే సమాజ దీపం అవుతుందని విద్యాశాఖ అధికారి మీనాక్షి తెలిపారు. బుధవారం ఉదయం మండల పరిధిలోని మానెంపల్లి పంచాయతీలోని గౌరీగాని పల్లి పాఠశాలలో పనిచేస్తూ పదవి విరమణ పొందిన ఉపాధ్యాయుడు ఆదినారాయణ సేవలకు గుర్తుగా లేపాక్షి లోని నవోదయ విద్యాలయంలో ఎంఈఓ నాగరాజు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరైన డీఈవో మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా పల్లెటూరి వ్యక్తిగా పల్లె మనస్సు గెలుచుకున్న ఉపాధ్యాయుడు ఆదినారా యణ సేవల అభినందనీయమని. ఇలాంటి గురువుల నుండే మంచి విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదుగుతారని అంతకుమించి పాఠశాల అభివృద్ధిలో కూడా సేవలు అమోఘం అన్నారు. అనంతరం ఎంఈఓ నాగరాజు మాట్లా డుతూ విద్యార్థులను తమ బిడ్డలుగా చూసుకుంటూ ప్రతిరోజు ఏదో ఒక కొత్త ప్రణాళికతో విద్యార్థులకు సూచనలు అవగాహన కల్పించే గొప్ప వ్యక్తి ఉపాధ్యాయుడు ఆదినారాయణ అన్నారు. వృత్తిలో నిబద్ధత తల్లి పట్ల ఆయన ప్రేమ మరువలేనిదన్నారు. పదోన్నతులు వచ్చిన తల్లి ఆరోగ్య రీత్యా పదోన్నతులకు దూరం గా ఉండి తల్లినీ జాగ్రత్తగా చూసుకోవడంలో ఆయనకు ఎవరూ సాటి లేరు అన్నారు. పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయుడు ఆదినారాయణ మాట్లాడుతూ తన జీవితంలో కోపతాపాలు గాని ఈర్ష ద్వేశాలకు గాని ఏనాడో రానివ్వరాదన్నారు.